'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# యాడాదిలోనే యాష్టకు వచ్చింది..!



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

**ఉద్యమ నాయకుడు, రాష్ట్ర నిర్మాతను కాదని అనుభవమే లేని నేతకు తెలంగాణ ప్రజలు అధికారాన్ని అప్పగించారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న వాటి కంటే కాంగ్రెస్ ఇంకా ఎక్కువ చేస్తుందని ప్రజలు భావించడమే అందుకు కారణం. అయితే, కొత్త పథకాలు కనిపించకపోగా, ఉన్నవి కూడా కనుమరుగవుతుంటే కలిగే నిరాశ అంతాయింతా కాదు.**

**ప్రజాస్వామ్యయుత పాలన లేకపోతే పురోగతి అన్నదే ఉండదు. అందుకే కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఏముందిలే గర్వకారణం? అన్న అభిప్రాయమే వినిపిస్తున్నది. ఏడాదిలోనే యాష్టకు వచ్చిందని అనేవారే ఎక్కువగా కనిపిస్తున్నారు.**

భూమి అంటే తెలంగాణ రైతులకు ప్రాణం కన్నా ఎక్కువ. అదొక వారసత్వ సంపద, బాధ్యత కూడా. పిల్లలకు ఏమిచ్చినా ఇవ్వకున్నా గుంట స్థలమైనా వారి చేతిలో పెట్టాలన్న పట్టుదల అందరికీ ఉంటుంది. అందుకే పైసాపైసా కూడబెట్టి ఎంతో కొంత పొలం కొనాలని చూస్తారు. తమ జీవనాధారమైన భూమిని బలవంతంగా గుంజుకోవాలని చూస్తే వారు ఊరుకుంటారా? అసలు భూసేకరణ చేయాల్సిన పద్ధతి ఇదేనా? రైతుల సమ్మతి లేకుండా భూములను చెరబట్టాలని చూస్తే చరిత్ర పునరావృతమవుతుంది. ఉమ్మడి ఏపీలో ఎన్నోసార్లు అదే జరిగింది. భూసేకరణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకునేందుకు ఎన్నెన్నో సంఘటనలు ఉదాహరణగా ఉన్నాయి. అదీ గిరిజనుల భూములను తీసుకునేటప్పుడు ఇంకెంత అప్రమత్తంగా ఉండాలో చెప్పాల్సిన పనిలేదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలోనే ఈ చరిత్రను విస్మరించారు. సుదూరప్రాంతాలకు వలస వెళ్లి, కూడబెట్టిన సొమ్ముతో కాస్త పొలం కొనుక్కుంటే.. దాన్ని కూడా పరిశ్రమల కోసం సేకరిస్తామంటే కడుపు మండదా? ఎంతోకొంత పరిహారం ఇస్తామంటే సరిపోతుందా? పరిశ్రమకు కావాల్సిన అన్ని పరికరాలను మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తారు. మరి కీలకమైన భూమికి మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లిస్తారు. భూ యజమానుల అభిప్రాయాలకు చోటే లేదా? ఇదెక్కడి న్యాయం? పరిశ్రమలకు ఉండే లాభాపేక్ష రైతులకు ఉండదా? అసలు ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం ఎందుకు భూమి సేకరించి ఇవ్వాలి? వ్యవసాయం ఉపాధి మార్గం కాదా? వాస్తవానికి, సమస్య ఉన్న చోటే సమాధానమూ దొరుకుతుంది. పరిశ్రమను ఎందుకు పెడుతున్నామో రైతులకు ముందుగా చెప్పి ఉంటే సమస్యే ఉండేది కాదు. కానీ, ప్రభుత్వం అలా చేయలేదు.

**తాజాగా రాష్ట్రంలో నడుస్తున్న మరో వివాదం మూసీ సుందరీకరణ. పోనీ ప్రభుత్వం చెప్పినట్టుగా పునరుజ్జీవమే అనుకున్నా.. దానికి ప్రాతిపదిక ఏమిటి? దానిపై మొదట ఏదైనా శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేశారా? అంటే ప్రభుత్వం వద్ద సమాధానమే లేదు. మరి పాలకుల అసలు ఉద్దేశం ఏమిటి? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదా? వీటికి ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ఆక్రమణలంటూ ఇళ్లను కూల్చివేస్తుండటం విచారకరం.**

మూసీ చుట్టుపక్కల ఇళ్లు కట్టుకున్నవారెవరూ కబ్జాదారులు కాదు. అవన్నీ సొమ్ము చెల్లించి కొనుక్కున్న స్థలాలే. ప్రభుత్వ అధికారులు కూడా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఒకప్పుడు అప్పటి అధికారులు అనుమతులు ఇచ్చిన ఇళ్లను ఇప్పటి అధికారులు అక్రమ ఇళ్లుగా ముద్రవేసి కూల్చివేస్తుండడంతో పాలనా వ్యవస్థపైనే ప్రజలకు అనుమానం వస్తున్నది. మూసీ పునరుజ్జీవంలో భాగంగా మల్లన్న సాగర్ నుంచి మంచినీరు తెచ్చి నదిలో నింపుతారట. కాళేశ్వరం మహా ప్రాజెక్టులో చివరి భాగమే మల్లన్న సాగర్. హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం కోసం మల్లన్నసాగర్‌ను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. ఆ ప్రాజెక్టే ఇప్పుడు మూసీకి వరంగా మారింది. మరి కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైందంటూ చేసిన



విషప్రచారంలో వాస్తవమెంత? అన్నదానిపై కాంగ్రెస్ నేతలే ఇప్పుడు సమాధానం చెప్పాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన కూడా వివాదాస్పదం అయింది. దానిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. ఇది సాక్షాత్తూ రాహుల్‌గాంధీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కార్యక్రమం. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టదలచిన ప్రాజెక్టు. వచ్చే ఏడాది చేపట్టనున్న జాతీయ స్థాయి జనాభా లెక్కలపై ప్రభావం చూపేది కూడా. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాల్సిన ఈ కార్యక్రమం ఆదిలోనే విమర్శలపాలైంది. తగిన కసరత్తు చేయకుండానే కాంగ్రెస్ సర్కార్ దీనిపై ముందుకెళ్లింది. కులగణన అంటే కులం వివరాలు మాత్రమే అడుగుతారని అందరూ అనుకున్నారు. నిజానికి ఇది సామాజిక-ఆర్థిక సర్వే. కులంతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులను కూడా అడిగి తెలుసుకుంటారు. ఆ వివరాలు తెలిస్తేనే సదరు సామాజికవర్గ సమగ్రాభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుందో ప్రభుత్వానికి తెలుస్తుంది. అయితే, ఈ విషయమై కనీసం అవగాహన కలిగించలేదు. విధివిధానాల రూపకల్పన, సర్వేలో ఏయే అంశాలు సేకరించాలనే విషయంపై అభిప్రాయాలు సేకరించలేదు. వాటిని రూపొందించిన తర్వాత అయినా ప్రజాభిప్రాయం తీసుకోలేదు. సోషల్ మీడియా యుగంలో ఈ విషయాన్ని విస్మరించడం ప్రభుత్వం చేసిన తప్పిదం. అందుకే, సర్వేకు వెళ్తున్న అధికారులకు సమాధానాలు చెప్పకుండా ప్రజలే వారిని ప్రశ్నిస్తున్నారు. అది జరగకపోవడం వల్లనే తొలిరోజు నుంచే ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతున్నది.

ప్రజల్లో వ్యతిరేకతకు మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. తమను మధుర లంబాడీలుగా గుర్తించాల్సి ఉండగా కేవలం మధుర అని నమోదు చేస్తుండటం పట్ల ఆదిలాబాద్ జిల్లాలో ఓ సదరు సామాజికవర్గం ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించడం లేదు. సర్వే ప్రతుల్లో విశ్వబ్రాహ్మణ అన్న మాట లేకపోవడం పట్లా అభ్యంతరాలు వస్తున్నాయి. పంచ శిల్పులను విశ్వబ్రాహ్మణులుగా గుర్తించాల్సి ఉన్నా అలా చేయడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన సామాజిక-ఆర్థిక సర్వేకు ప్రజలందరూ సహకరించారు. ప్రజల గోప్యతకు భంగం కలగకుండా అవసరమైన వివరాలే తీసుకుని, పథకాలను రూపొందించి అమల్లోకి తెచ్చింది బీఆర్ఎస్ సర్కార్.

పథకాల విషయానికి వస్తే మునుపటి ప్రభుత్వం కన్నా మెరుగ్గా ఉంటాయని ప్రజలు ఆశించారు. కానీ, ముందునుంచీ అమల్లో ఉన్న పథకాలనే కాంగ్రెస్ సర్కార్ సరిగ్గా అమలు చేయడం లేదు. అలా చేస్తే ప్రజల్లో అసంతృప్తి కలగకుండా ఉంటుందా? కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పథకాల్లో ముందుగా చెప్పుకోవాల్సింది రైతుబంధు గురించి. కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత ఇంతవరకు ఒక్కసారి కూడా రైతుబంధు ఇవ్వలేదు. గత యాసంగికి ఇచ్చిన రైతుబంధు నిధులను కేసీఆర్ సర్కారే సమకూర్చి పెట్టింది. రుణమాఫీ కారణంగా నిధులు లేక ఇవ్వలేకపోయామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుబంధును ఎగ్గొట్టి రుణమాఫీ చేస్తారా? అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ఈ పథకాన్ని రాజకీయ లబ్ధి కోసం ప్రవేశపెట్టలేదు. ఉద్యమ సమయంలో రైతుల కష్టాలను స్వయంగా చూసిన ఆయన అందుకు పరిష్కార మార్గంగా దీన్ని రూపొందించారు. పెట్టుబడులకు సొమ్ము లేక, అప్పు పుట్టక, సతమతమయ్యే రైతుల కష్టాలను గట్టెక్కించడానికి తీసుకొచ్చిందే రైతుబంధు పథకం.

**కేసీఆర్ సర్కార్ తీసుకొచ్చిన మరో పథకం రైతు బీమా కూడా కాంగ్రెస్ పాలనలో ఉనికి కోల్పోతున్నది. ప్రమాదవశాత్తు మృతిచెందిన, సహజంగా మరణించిన రైతు కుటుంబాలకు రూ.5.లక్షల చొప్పున కేసీఆర్ సర్కార్ ఆర్థిక సాయం అందజేసింది. కర్మకాండ ముగియకముందే వ్యవసాయ అధికారి ఇంటికి వచ్చి మరీ అప్పట్లో చెక్కు అందించేవారు. కానీ, ఇప్పుడు ఏ ఒక్క రైతు కుటుంబానికి బీమా సొమ్ము అందడం లేదు. ధాన్యానికి మద్దతు ధర, సన్నాలకు రూ.500 బోనస్ విషయంలోనూ గందరగోళమే. సీజన్ ముగుస్తున్నా వీటిపై స్పష్టత లేదు. ధాన్యం కొనకపోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తలెత్తింది.**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షకు తోడు తులం బంగారం ఇస్తామని చెప్పి.. ఇప్పుడు అసలే ఇవ్వడం లేదు. ఇలా ఏ పథకాన్ని చూసినా అమలులో లోటుపాట్లు కనిపిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి భారీ పథకాలను కేసీఆర్ సర్కార్ చేపట్టినప్పుడు స్పష్టమైన కార్యాచరణ ఉండేది. ఆ పథకాల ఫలితాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించేవి. వాటి ప్రభావం ప్రజల జీవితాలపై ఉండేది. ప్రస్తుతం పథకాలే కాదు.. ప్రజల ఇతర సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. హైదరాబాద్‌లో అయిదు నిమిషాల పాటు కరెంటు పోతే చాలు.. కేసీఆర్ ఉన్నప్పుడు ఇలా ఉండేది కాదనే మాటలు వెంటనే ప్రజల నోటి వెంట వస్తున్నాయి.

**కాంగ్రెస్ సర్కార్ గద్దెనెక్కి ఏడాదవుతున్నా పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయలేదు. మంత్రిగా కూడా అనుభవం లేని ముఖ్యమంత్రి వద్ద కీలకమైన హోం శాఖతో పాటు, మరో నాలుగు శాఖలు కూడా ఉండటం గమనార్హం. పూర్తిస్థాయి హోం మంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. పోలీసుల వ్యవస్థపై ప్రభావం పడుతున్నది. రాజకీయ కారణాలతో పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. ముఖ్యమంత్రి ఇప్పటి వరకు 26 సార్లు ఢిల్లీ వెళ్లారు. అయినా మంత్రివర్గ విస్తరణ సమస్య కొలిక్కి రాలేదు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య సమన్వయం లోపిస్తే పాలన ఎలా ఉంటుందో చెప్పేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఉదాహరణ.**

కాంగ్రెస్ సర్కార్ ధోరణిని తెలంగాణ సమాజం మొదటి నుంచీ గమనిస్తూనే ఉన్నది. అనుభవం, అవగాహన లేకపోవడమే కాంగ్రెస్ వైఫల్యాలకు ప్రధాన కారణం. బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ తొలి నుంచి సలహాలు, సూచనలు ఇస్తూనే, వివిధ అంశాలపై విమర్శిస్తూనే ఉన్నది. కానీ, వాటిని రాజకీయ విమర్శలుగా కాంగ్రెస్ కొట్టిపారేస్తున్నది. అంతేకాదు, ఎదురుదాడి చేస్తోంది. రుణమాఫీ అమలుపై హరీశ్‌రావు రైతులతో కలిసి పెద్ద ఉద్యమమే చేశారు. అందుకే ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని తొలి గడువు, తాజాగా డిసెంబరు 9 నాటికి పూర్తవుతుందని రెండో గడువు పెట్టుకుంది. అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చడం కూడా ప్రస్తుతానికి ఆగింది. ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తన ధోరణిని మార్చుకోవాలి. లేకపోతే కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం.

*(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)*


> **భూసేకరణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకునేందుకు ఎన్నెన్నో సంఘటనలు ఉదాహరణగా ఉన్నాయి. అదీ గిరిజనుల భూములను తీసుకునేటప్పుడు ఇంకెంత అప్రమత్తంగా ఉండాలో చెప్పాల్సిన పనిలేదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలోనే ఈ చరిత్రను విస్మరించారు. సుదూరప్రాంతాలకు వలస వెళ్లి, కూడబెట్టిన సొమ్ముతో కాస్త పొలం కొనుక్కుంటే.. దాన్ని కూడా పరిశ్రమల కోసం సేకరిస్తామంటే కడుపు మండదా?**

**జనగణనకు కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మహిళలకు చట్టసభల్లో మూడవ వంతు స్థానాల కేటాయింపు, నియోజకవర్గాల పునర్విభజనకు మార్గం సుగమం కానుంది. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను 848కి పెంచుతారా? లేక కేంద్రం చెప్తున్నట్టు 888కి పెంచుతారా? అనే అంశం తెలియాల్సి ఉంది. ఏతావాతా మహిళా రిజర్వేషన్లు, పునర్విభజన అమలయ్యే అవకాశం ఉంది. కానీ, లోక్‌సభ సీట్ల పెంపు మాత్రం రాజ్యాంగ సవరణ చేస్తేనే తప్ప సాధ్యపడదు. జనగణన తర్వాత జరిగే పునర్విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల సంఖ్య వరుసగా 175 నుంచి 225, 119 నుంచి 153కి పెరిగే అవకాశం ఉండటం గమనార్హం.**

# పార్లమెంట్ సీట్ల పెంపు తెమిలేనా?



ఇనగంటి రవికుమార్
94400 53047



128వ రాజ్యాంగ సవరణ చట్టం (106వ రాజ్యాంగ సవరణ) అమల్లోకి వచ్చిన 2023 సెప్టెంబర్ 19వ తేదీ తర్వాత జరిగే తొలి జనగణన లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేసి, మహిళలకు రొటేషన్ పద్ధతిలో మూడో వంతు సీట్లను 3 పర్యాయాలు కేటాయించాలని పార్లమెంట్ నిర్దేశించింది. దీనివల్ల 2026 తర్వాత జరిగే జనగణనతో పునర్విభజన అనే నిబంధన తొలగిపోతుంది. చివరిదైన పార్లమెంటు స్థానాల పెంపునకు 84వ అధికరణాన్ని సవరించడం ద్వారా 82వ అధికరణానికి ఉన్న అడ్డంకిని అధిగమించవచ్చు.

### జమ్మూకశ్మీర్‌లో ఎలా పెంచారు?

2026 తర్వాత జరిగే తొలి జనగణన ప్రకారం పునర్విభజన చేయాలని 84వ అధికరణం చెబుతున్నది. అయినప్పటికీ, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్థానాలను 83 నుంచి 90కి పెంచి ఎన్నికలు నిర్వహించారు. 370వ అధికరణం రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఏమీ లేదు. ఆర్టికల్ 3, 4 ప్రకారం జమ్మూకశ్మీర్ రాష్ట్ర విభజన చట్టాన్ని ఆమోదించారు. ఆ చట్టంలో 2026 జనగణన తర్వాత అనే అంశానికి బదులుగా 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేయాలని పేర్కొన్నారు. అందువల్లనే అక్కడ సాధ్యపడింది. మహిళా బిల్లు కూడా 2026 తర్వాత జరిగే జనగణన స్థానంలో 84వ అధికరణానికి బదులుగా 128వ రాజ్యాంగ సవరణ తర్వాత జరిగే జనగణన ద్వారా పునర్విభజన జరపాలని ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.

### అమలుకు మార్గాలు:

2024, 2025లో జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్పీఆర్) పూర్తి చేసుకుని, 2026 జనవరిలో జనగణన వివరాలు డిజిటల్ విధానంలో ట్యాబ్‌ల ద్వారా సేకరిస్తారు కాబట్టి త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది. 2026 జనవరి నాటికి జనగణన పీసీఏ (ప్రైమరీ సెన్సస్ అబ్‌స్ట్రాక్ట్)ను ప్రకటించవచ్చు. ఇది పునర్విభజనకు సరిపోతుంది. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్ స్థానాలను పెంచుతారా? లేక మరో 20 ఏండ్లు నిషేధం పొడిగిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుత లోక్‌సభ స్థానాల ప్రకారం పునర్విభజన చేస్తే ఉత్తరాదిలో భారీగా సీట్లు పెరిగి, దక్షిణాదికి తీవ్రంగా నష్టం జరుగుతుంది. అలాకాకుండా మొత్తం సీట్లను 848 లేదా 888కి పెంచుతారా? అన్నది ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. ఈ అంశంపై బీజేపీ సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎన్డీయే పక్షాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**ఒకవేళ పార్లమెంట్ స్థానాల సంఖ్య పెంచే అవకాశం లేకపోయినా, 2026లో జనగణన పూర్తయితే పునర్విభజన జరిపి మహిళలకు 3వ వంతు సీట్లు కేటాయించవచ్చు. అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల పెంపునకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఒక వ్యక్తి -ఒక ఓటు -ఒక విలువ అన్న ప్రజాస్వామిక, రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునఃకేటాయింపు, పునర్విభజన జరిగితే దక్షిణ, ఉత్తర భారత్‌ల మధ్య విద్వేషం పెరిగే అవకాశాలు లేకపోలేదు.**

### నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలు:

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల నిష్పత్తిలో గణనీయమైన మార్పులున్నాయి. టోటల్ ఫెర్టిలిటి రేట్ (దేశ సగటు) 1971లో 5.2, 1981లో 4.5, 1991లో 3.6, 2001లో 3.1, 2011లో 2.4గా నమోదైంది. అయితే, ఉత్తరాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌లో జనాభా గణనీయంగా పెరగగా దక్షిణాది రాష్ట్రాలతో పాటు కొన్ని చిన్న రాష్ట్రాల్లో దేశ సగటు కంటే చాలా తక్కువగా జనాభా పెరుగుదల నమోదైంది.

| రాష్ట్రం | 1971 | 2011 |
|---|---|---|
| ఏపీ | 4.6 | 1.8 |
| బీహార్ | 5.7 | 3.7 |
| కేరళ | 4.1 | 1.8 |
| మధ్యప్రదేశ్ | 5.6 | 3.2 |
| ఉత్తరప్రదేశ్ | 6.6 | 3.6 |
| తమిళనాడు | 3.9 | 1.8 |

### జనాభా నియంత్రణే శాపమా?

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా అవతరించింది. ప్రస్తుతం భారత జనాభా 140 కోట్లకు పైగా ఉన్నట్టు ఓ అంచనా. మన దేశంలో జనాభా నియంత్రణకు 1950వ దశకం నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను విజయవంతంగా నియంత్రించాయి. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం ఈ విషయంలో పూర్తిగా విఫలమయ్యాయి. అయితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది.

2023 అంచనాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో ఒక పార్లమెంట్‌కు సగటున 23 లక్షల మంది జనాభా ఉండగా.. బీహార్‌లో 31 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 23 లక్షలు, రాజస్థాన్‌లో 32 లక్షలు, ఏపీలో 21 లక్షలు, తెలంగాణలో 22 లక్షలు, మేఘాలయలో 16 లక్షలు, చండీగఢ్‌లో 12 లక్షలు, హిమాచల్‌ప్రదేశ్‌లో 18 లక్షల మంది జనాభా ఉన్నారు. మొదటి మూడు పునర్విభజనలను జనాభా ప్రాతిపదికన చేసినప్పటికీ పైన పేర్కొన్న విధంగా దేశంలో జనాభా పెరుగుదల, తగ్గుదల విషయంలో వివిధ రాష్ట్రాలలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. లోక్‌సభ స్థానాలను 888కి పెంచితే 2026 జనాభా లెక్కల అంచనా ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లో 143, బీహార్‌లో 79, పశ్చిమబెంగాల్‌లో 60, మహారాష్ట్రలో 76, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 54, తమిళనాడులో 49, రాజస్థాన్‌లో 50, గుజరాత్‌లో 43 పార్లమెంట్ స్థానాలుంటాయి. అంటే ఈ కేటాయింపుల వల్ల దక్షిణాదిలో మొత్తంగా సీట్ల సంఖ్య 130 నుంచి 165కు పెరిగినప్పటికీ ఇప్పుడున్న లోక్‌సభలో 23.19 శాతంగా ఉన్న ప్రాతినిధ్యం 19 శాతానికి పడిపోతుంది. ఇది ఆందోళనకరమైన పరిణామం.

ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను మార్చకుండా 2025లో కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిపి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. తెలంగాణ 3, ఏపీ 5, కర్ణాటక 2, తమిళనాడు 8, కేరళ 8 స్థానాలను కోల్పోతాయి. పశ్చిమబెంగాల్ 4, ఒరిస్సా 3, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఒక్కో సీటు చొప్పున నష్టపోతాయి. ఇక పెరిగే సీట్లన్నీ హిందీ రాష్ట్రాల్లోనే. ఉత్తరప్రదేశ్‌లో 11, బీహార్‌లో 10, రాజస్థాన్‌లో 6, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఒకటి చొప్పున సీట్లు పెరుగుతాయి. ఈ పునర్విభజన వలన వచ్చే దుష్పరిణామాల నివారణకు మరోసారి రాజ్యాంగ సవరణ చేయడం సముచితం.

### ప్రత్యామ్నాయ ప్రతిపాదన:

దేశవ్యాప్తంగా ఒక్కో రాష్ట్రంలో ఇప్పుడున్న పార్లమెంట్ స్థానాల సంఖ్యకు అదనంగా 33 శాతం పెంచితే బాగుంటుంది. అంటే ఈ లెక్కన ఉత్తరప్రదేశ్‌లో 27 స్థానాలు పెరుగుతుండగా, తమిళనాడులో 13, ఆంధ్రప్రదేశ్‌లో 8, తెలంగాణలో 5 స్థానాల చొప్పున పెరుగుతాయి. ఈ ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతాయి. ఇప్పుడున్న జనాభా, పార్లమెంట్ స్థానాల నిష్పత్తి కూడా అలాగే కొనసాగుతుంది.

హిందీ బెల్టులో పెరిగే సీట్ల వల్ల లబ్ధి పొంది అధికారాన్ని ఎన్నటికీ తమ చేతిలో ఉంచుకోవాలన్న బీజేపీ ఆలోచనలు మారకుంటే విపత్కర పరిణామాలు సంభవిస్తాయి. ఉత్తరాది వారు తమకు ద్రోహం చేస్తున్నారని దక్షిణాది రాష్ట్రాల ప్రజలు భావించే అవకాశం ఉంది. అంతేకాదు, దీనివల్ల సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. అదే జరిగితే దేశ విభజన దిశగా ఆలోచనలు పురుడు పోసుకునే అవకాశమూ లేకపోలేదు.

*(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)*



# ఫార్మా సర్పాలు

గగనంలో నుంచి గద్దల్లా
భూమి మాంసాన్ని వెతుకుతున్నరు
మందుల కంపెనీల పేరుచెప్పి

గిరిజనుల గుండెలను పీక్కుతింటున్నరు
వారి జీవనమెట్లా
పిల్లాపాపల చదువులెట్లా
ప్రజా భవిష్యత్తు చాటున పెట్టుబడులు

డబ్బున్న మేకవన్నె పులులు
కంపెనీ సాకుతో ధరణిపై మాటేసింద్రు
భూమి నుండి గెదుముతున్నరు
కాదంటే లాఠీలతో తరుముతున్నరు
చెరబట్టడానికి రైతులేమన్న హంతకులా?

బిడ్డల గోస
తండ్రుల నీడ
భర్త ఎక్కడున్నడో తెల్వదు
ఏ బందీఖానల్లో ఉంచింద్రో చెప్పరు
భర్త జాడకై నిండు గర్భిణి పరుగులు
సీతమ్మకు కూడా ఇన్ని సెరలు లేవేమో
ఇది ఇందిరమ్మ ఎమర్జెన్సీ రాజ్యమా?

మా భూముల్లో
మా ముత్తాతల తాతల తండ్రుల ఆనవాళ్లు
వారి పాదముద్రలను అరకలు చేసి దున్నినం
పంటలెండిపోతే గడ్డికాల్చి మళ్లీ పొలం చేసినం
మాకు కుట్రలు కుతంత్రాలు తెలువవు
ఫార్మా సర్పాలై పడగెత్తి వెంటబడింద్రు
మా శవాల మీదనా మీ నయా నగరాలు?

చెమట తల్లులు
గింజల తండ్రులు
కర్షకులు ఎదురు తిరుగలే
మా భూములు మాకేనని మర్లబడ్డరు
న్యాయం కోసం నిలబడ్డరు
ఇనుప పాదాలకు భూములెన్నైనా సరిపోవు

తరతరాలుగా అంబలి గంజినీళ్లకేడ్సినం
వలసపక్షులై గోసపడ్డం
దేశానికి ఆనకట్టలు పాలమూరు కూలీల చేతులే
సోరసోర బిడ్డలను నాయనలను పోగొట్టుకున్నం
తెలంగాణ స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నం
మా భూముల్లో నీళ్లు పంటలు కళ్ల చూసుకుంటున్నం
ఇంతలోనే మా భూమిలో మేము పరాయివాళ్లమా?



వనపట్ల సుబ్బయ్య
94927 65358

